## క్లుప్తంగా

### నూతన కార్యవర్గం ఎన్నిక

**కొడకండ్ల:** కొడకండ్ల లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామెర రవీందర్, కార్యదర్శిగా గాజుల రాములు, కోశాధికారిగా నేతి కొండయ్యలు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు పేరం రాము, దోర్నం ప్రభాకర్ వారికి బాధ్యతలు అప్పగించారు.

### సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

**రఘునాథపల్లి:** సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని రఘునాథపల్లి లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షుడు కందుల అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం జోన్ చైర్మన్ లయన్ కూరెళ్ల ఉపేందర్ గుప్తా చిన్న కుమారుడు వినయ్‌కుమార్‌గుప్తా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ఉపేందర్‌గుప్తా ముందంజలో ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి రాజుగౌడ్, పూర్వ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, లక్ష్మణ్, వేదకుమార్, సురేష్, కర్ణాకర్, కదారి శ్రీనివాస్, రహీంపాషా, చింతకింది అశోక్, బచ్చు శ్రీనివాస్, దుద్దిల్ల రాజేందర్ పాల్గొన్నారు.

### కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయండి

**కొడకండ్ల:** సమగ్ర కుల గణన చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటాను అమలు పర్చి బీసీలకు న్యాయం చేయాలని బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసి కోరినట్లు బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గిరగాని క్రాంతికుమార్‌గౌడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో చైర్మన్ చాంబర్‌లో శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసి సన్మానించి వినతిపత్రం సమర్పించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు క్రాంతికుమార్ గౌడ్ తెలిపారు.

### వర్షాలకు కూలిన ఇళ్లు

**బచ్చన్నపేట:** మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోయాయి. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడబోయిన అనసూర్య, నలగొప్పుల ఏశవ్వల ఇళ్లు కూలిపోయాయి. ఏశవ్వ రాత్రి నిద్రిస్తుండగా ఇల్లు మరోవైపు కూలింది. అదే ఇంట్లో రోజూ నిద్రించే అనసూర్య పక్క ఇంట్లో నిద్రించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ. 5 లక్షలు నష్టపోయామని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు.

### యువతకు పెద్దపీట



**బచ్చన్నపేట:** సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో యువతకు పెద్ద పీట వేస్తున్నారని మండలంలోని కట్కూర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గ్రామ ఎనుగుల శ్రీధర్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన నల్లనాగుల శ్వేతవెంకటాచారీని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రైతుల పక్షాన నిరంతరం కృషి చేస్తామని వారు చెప్పినట్లు తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు ఆవు మృతి



**దేవరుప్పుల:** ప్రమాదవశాత్తు జారిపడి ఆవు మృతువాత పడిన సంఘటన సోమవారం దేవునిగుట్టతండాలో చోటుచేసుకుంది. మాధాపురం రెవెన్యూ పరిధి దేవునిగుట్టతండాకు చెందిన రైతు ధరావత్ కూన ఆవును మేత కోసం వదిలి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తిరిగి సాయంత్రం ఆవును తీసుకెళ్లేందుకు రాగా గట్టుకింద పడి మృతి చెంది ఉంది. దీంతో బాధిత రైతు కుటుంబం రోధిస్తూ రూ.60 వేల విలువైన పాడిఆవు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రైతులకు ప్రత్యామ్నయ ఆదాయాన్ని సమకూర్చి పాడి సంపదకు తగిన బీమా వర్తింపజేసి ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కురుస్తున్న తరగతి గదులు

- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



కురుస్తున్న పాఠశాల పైకప్పును చూపిస్తున్న విద్యార్థులు

**స్టేషన్‌ఘన్‌పూర్:** మండలంలోని నమిలిగొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతి గదులు వర్షానికి కురుస్తుండగా విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకే పాఠశాల పైకప్పు ఉరుస్తుందంటే మున్ముందు పెద్ద వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ప్రభుత్వ విద్యపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పనిచేస్తుండగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన వసతులు ఉన్నాయని ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా నమిలిగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో పరిస్థితులు అందుకువిరుద్ధంగా ఉన్నాయి. గత విద్యాసంవత్సరం మన ఊరు–మన బడిలో నమిలిగొండ యూపీఎస్ ఎంపిక కావడం, రూ.22 లక్షలతో పనులు చేపట్టినట్లు అధికారులు చెపుతుండగా వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. తరగతి గదులకు చెందిన భవనం స్లాబ్ పగుళ్ల మరమ్మతు పనులు కాంట్రాక్టర్ నాణ్యతలోపంతో చేయడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారింది. లక్షల రూపాయలతో తూతూమంత్రంగా పనులు చేయగా తేలికపాటి వర్షాలకే తరగతి గదులు కురుస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తుంది. కాంట్రాక్టర్ నాణ్యతాలోపంతో పనిచేయడం, సంబంధిత అధికారులు, పాఠశాల హెచ్‌ఎం పట్టించుకోకపోవడం వెరిసి ప్రస్తుతం విద్యార్థులకు శాపంగా మారింది. తేలికపాటి వర్షానికే గదులు ఉరువడంతో పాటు పాఠశాల ఆవరణ మొత్తం వర్షపునీరు నిలిచి అధ్వాన్నంగా మారుతోంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో మరమ్మత్తు పనులు చేయించాలని, లేనిపక్షంలో తమ పిల్లలను బడికి పంపేది లేదంటూ తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, పేరెంట్స్ కోరుతున్నారు.

## ‘స్మితా సబర్వాల్‌పై చర్య తీసుకోవాలి’

**లింగాలఘణపురం:** సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్ల కోటా ఎందుకంటూ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ‘ఎక్స్’ వేదికలో చేసిన ట్వీట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు గడ్డం అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పటేల్‌గూడెంలో దివ్యాంగుల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. స్మితా సబర్వాల్ మాటలు కోర్టు తీర్పులను తప్పుబట్టే విధంగా ఉన్నాయని, దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ప్రభుత్వ విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొయ్యాడ రాజు, ముస్కు మల్లయ్య, దేవరాయ మల్లయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

**కొడకండ్లలో..**

**కొడకండ్ల:** దివ్యాంగులను కించపర్చే విధంగా పోస్ట్ పెట్టిన ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌పై చర్య తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు వీరదాసు నవీన్ డిమాండ్ చేశాడు. దివ్యాంగులను కించపర్చే విధంగా ఎక్స్‌లో పోస్ట్ చేసిన స్మితసభర్వాల్‌పై చట్టరీత్యా చర్య తీసుకుని దివ్యాంగుల పట్ల ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన కోరారు.

## అంగన్‌వాడీల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం



చిల్పూరు: అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

**చిల్పూరు:** మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ దూలమ్మ మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో అక్షరాలు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు మంద రేణుక, గుర్రం నీనా, సట్ల కవిత, అరుణ, కర్ణకంటి వాణిస్వర్ణవీణ, మంతెన విజయరాణి, అన్నం రోజారమణి, నామోజు జ్యోతి, శోభ, సౌభాగ్య, విజయ, రజిత, తండ కవిత, గ్రేసి, ఏఎన్‌ఎం మంజుల, ఆశ వర్కర్లు సుమ, బాలమణి, మహేశ్వరి పాల్గొన్నారు.

**కోనాయిచలంలో..**

**జఫర్‌గఢ్:** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కోనాయిచలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యస కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు గీతారాణి, సునీత, ఉపేంద్ర, అయాలు సులోచన, కమలమ్మ, సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పాకాలలో..**

**కొడకండ్ల:** మండలంలోని పాకాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కోట బయ్యన్న మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, శ్రీలత, భారతి, దుర్గా, మైబా, సునీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

**పాలకుర్తి:** విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం పాలకుర్తిలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు వరంగల్ సీపీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై సాయిప్రసన్నకుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**కొడకండ్ల:** మండలంలోని రామన్నగూడెం శివారు వాలుతండాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కున్సోత్ మంగ్తానాయక్ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ తండాకు వెళ్లి మంగ్తానాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. జిట్టబోయిన సోమన్న, వీర్యానాయక్, రెడ్యా, మల్లేష్, అజయ్, నరేందర్ ఉన్నారు.

**ఆర్థికసాయం**

**బచ్చన్నపేట:** మండల కేంద్రంలో మృతి చెందిన టేకుపల్లి యాదమ్మ కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీటీసీ బొమ్మెన అరుణఅంజనేయులుగౌడ్ పరామర్శించి రూ. 2వేల సాయం అందజేశారు. నాయకులు అల్వాల నర్సింగారావు, కర్రె భాస్కర్, యాదగిరి, జంపయ్య, బి.యాదగిరి, ఉపేందర్, సోమయ్య ఉన్నారు.

**పలు గ్రామాల్లో..**

**దేవరుప్పుల:** మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరాములు పరామర్శించారు. సోమవారం కడవెండిలో అనారోగ్యానికి గురైన తుమ్మ రాజిరెడ్డిని, రామరాజుపల్లిలో పెలివెళ్లి నరహరిని పరామర్శించారు. ధర్మారెడ్డి, పాండుకృష్ణ, గణేశ్, నాగరాజు, సజ్జన్, అచ్చయ్య తదితరులు ఉన్నారు.

## బాల కవి సమ్మేళనం



దాశరథి జయంతిలో టీచర్లు, విద్యార్థులు

**జఫర్‌గఢ్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా బాల కవి సమ్మేళనం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగ అధ్యక్షుడు ఉపాధ్యాయులు డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటలు, కవితలు, పద్యాలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. శ్రీకాంత్ మాట్లాడారు. తెలుగు ఉపాధ్యాయులు భూక్య నరేష్, నాగలక్ష్మి, డాక్టర్ జానీనాయక్, కిరణ్‌కుమార్, కందకట్ల గణేశ్ పాల్గొన్నారు.

### సీపీని కలిసిన దేవరుప్పుల ఎస్సై



**వరంగల్ క్రైం:** దేవరుప్పుల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సృజన్ కుమార్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సీపీకి మొక్క అందజేశారు.

**ఎస్సైకి సన్మానం**

**దేవరుప్పుల:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఊర సృజన్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్వాగతించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ జిల్లా కార్యదర్శులు ధర్మారెడ్డి, పాండుకృష్ణ, నాయకులు పాల్గొన్నారు

### ‘కార్పొరేషన్’ ఏర్పాటు చేయాలి

**బచ్చన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరల సంక్షేమార్థం వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు శివరాత్రి రాజు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర కులస్తులు అనాదిగా కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్నారన్నారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని కోరారు.

### కలెక్టర్‌ను కలిసిన పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

**జనగామ రూరల్:** జిల్లాకు నూతనంగా బదిలీపైవచ్చిన పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



రఘునాథపల్లి: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



తరిగొప్పులలో..



పాలకుర్తిలో..

**రఘునాథపల్లి/పాలకుర్తి/ జనగామ రూరల్/ చిల్పూరు/స్టేషన్‌ఘన్‌పూర్/తరిగొప్పుల/ దేవరుప్పుల:** ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి ఓబీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన, రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించి విస్మరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా బీసీలకు ఇచ్చిన హామీలు సత్వరం అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కావటి ముత్యాలు, మంద వెంకటేశంయాదవ్, పుప్పాల వేణుకుమార్, మామిండ్ల వెంకన్న, దుంపలి సంపత్, దొంగరి మనోహర్, బాల్నె శ్రీనివాస్, ఊరడి రాజు, గంటి ఉపేందర్, బిజ్జ రమేష్, లద్దునూరి, మహేష్, దుబ్బ రాజశేఖర్, ముంగి దనుజంయ్, సట్ల వెంకటరమణ, కె.శరత్‌కుమార్, ఆవుల శ్రీనివాస్,ఏడెల్లి రాంనర్సింహారెడ్డి, జీల సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

**కొడకండ్ల:** ఈ సంవత్సరం జూన్ 28 వరకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన, ఇప్పటి వరకు రైతు బీమా నమోదు చేసుకోని రైతులు రైతుబీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి కోరారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన రైతులు మాత్రమే ఇందుకు అర్హులని, రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, నామిని ఆధార్ కార్డుల జిరాక్స్‌లను దరఖాస్తుకు జతచేసి ఆయా గ్రామాలకు సంబంధించిన ఏఈఓలకు ఈ నెలాఖరు వరకు అందజేయాలని ఆయన కోరారు. గతంలో రైతుభీమా నమోదు చేసుకొని మార్పులు, చేర్పులు చేసుకొవాలనుకొనే రైతులు కూడా దరఖాస్తులు చేసుకొవచ్చని ఆయన తెలిపారు.

## రుణమాఫీ కాలేదని ఆందోళన చెందవద్దు


**చిల్పూరు:** ప్రభుత్వం మొదటి విడతగా ప్రకటించిన రూ. లక్ష రుణమాఫీ ఇండియన్ బ్యాంకు మల్కాపూర్ శాఖలో కాలేదని రైతులు ఆందోళన చెందొద్దని ఇండియన్ బ్యాంకు మేనేజర్ గోన గోపిరాజ్ తెలిపారు. మండలంలోని మల్కాపూర్ ఇండియన బ్యాంకులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.రెండు లక్షల రుణమాఫీకి అర్హులైన రైతులు బ్యాంకులో 2,982 మంది ఉన్నట్లు తెలిపారు. అందులో రూ. లక్ష వరకు 876 మంది రైతులు, రూ.లక్ష నుంచి 1.50 లక్షల వరకు 813 మంది, రూ. 1.50లక్షల నుంచి 2 లక్షల వరకు 1,087, రూ. 2 లక్షలకు లోపు 206 మంది రైతులు ఉన్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మొదటి విడతలో రూ. లక్ష రుణమాఫీని ఈనెల 18వ తేదీన విడుదల చేశారని, అందులో మల్కాపూర్ ఇండియన్ బ్యాంకులో రూ. లక్షకు అర్హులైన 876 మంది రైతులకు చెందిన పేర్లలో ఎర్రర్ రావడంతో కనిపించడం లేదన్నారు. ఈవిషయంపై జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు కారణాలు తెలుసుకుంటున్నారని చెప్పారు. కావున ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణ మాఫీ వర్తిస్తుందని తెలిపారు.

## జాబితాలో లేకుంటే ఫిర్యాదులు ఇవ్వండి

**లింగాలఘణపురం:** మొదటి విడతగా రూ.లక్ష రుణమాఫీ జాబితాలో పేరులేని రైతులు ఆయా క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు గాని, నేరుగా తనకు గాని ఫిర్యాదులు అందజేయవచ్చని ఏఓ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాఫీ జాబితాలో లేదని ఆందోళన చెందవద్దని ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామని, అర్హులుటే తప్పకుండా మాఫీ కోసం చర్య తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఇప్పటికే ఆయా బ్యాంక్‌ల నుంచి రుణమాఫీ రైతుల జాబితా తీసుకొని గ్రామాల వారీగా వేరు చేయడం జరుగుతుందని, బ్యాంకులో ఇబ్బంది కలుగకుండా గ్రామాల వారీగా బ్యాంకర్లతో చర్చించి త్వరలో తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. ఇప్పటికే కుందారం నుంచి సుమారు 30 నుంచి 40 మంది రైతులు మాఫీ కాలేదంటూ ఫిర్యాదులు చేశారని, వారి వివరాలను పరిశీలిస్తున్నామని వివరించారు.

# ఆలయ అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు

- నిధుల మంజూరు, సత్వర పనులకు ఎమ్మెల్యే హామీ
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయం

**చిల్పూరు:** ఏళ్లుగా ఎదురు చూస్తున్న బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇవ్వడంతో భక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తెలంగాణలో రెండో తిరుపతిగా పేరుగాంచిన చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి ప్రతీ ఒక్కరికి ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి గాంచాడు. ఆలయంపై ఎంతో ఆదాయం వస్తున్నా దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి ప్రత్యేక నిధులు రాక పోవడంతో దాతల ద్వారా కొంత ఆలయ అభివృద్ధి జరుగుతోంది. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి శాశ్వత దాతగా ఉన్న పొట్లపల్లి శ్రీధర్‌రావు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక తన సొంత నిధులు, దాతలు అందించిన సాయంతో ఆలయ రూపురేకలు మార్చించారు. భక్తుల సంఖ్య పెరగడంతో ఆలయ అధికారులు సౌకర్యాలు కల్పించలేక పోతున్నారు. ఈ విషయాన్ని శ్రీధర్ రావు.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల చిల్పూరు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల అభివృద్ధితో పాటు ఆలయ అభివృద్ధికి రూ. 10 కోట్లు మంజూరు చేయించడంతో పాటు పనులు కూడా సత్వరమే మొదలు పెట్టిస్తానని హామీ ఇవ్వడంతో భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**చేయాల్సిన పనులు..**

రూ. 10 కోట్లు మంజూరు అయితే గుట్టపై ముఖ్యంగా చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఆలయానికి పిల్లర్లు లేకుండా కేవలం బండపై నిర్మించారు. పిల్లర్లతో పెద్దగా నిర్మించాలి. గుట్ట పైభాగంలోనే అన్నదాన సత్రం, పార్కింగ్, కోనేరు ఏర్పాటు చేయాలి. చుట్టూ ప్రాకారం నిర్మించాలి. గుట్టపై నుంచి కింది వరకు డ్రెయినేజీ సౌకర్యం ఏర్పాటు, భక్తులకు వసతులతో కూడిన గదులు నిర్మించాలి.

### భక్తులకు మరిన్ని సౌకర్యాలు ఏర్పడుతాయి



ప్రభుత్వం నుంచి రూ. 10 కోట్లు మంజూరు అయితే ఆలయానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు ఏర్పడుతాయి. పనులు జరుగుతుంటే దాతలు కూడా ముందుకు వస్తారు.

– బాగం లక్ష్మీప్రసన్న, ఆలయ ఈఓ

### రూ. 10 కోట్లు మంజూరు శుభ పరిణామం



ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్ల మంజూరుకు ఎమ్మెల్యే శ్రీహరి తీసుకున్న నిర్ణయం శుభ పరిమాణం. యాగశాల అవసరం కూడా ఆలయానికి ఎంతో ముఖ్యం.

– రవీందర్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

### ఎమ్మెల్యేతో పనులు అవుతాయి..



ఎమ్మెల్యే కడియం శ్రీహరితోనే తాను అనుకున్న అభివృద్ధి పనులు అవుతాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు మరితం అభివృద్ధికి తన సొంత నిధులతో పాటు దాతల ద్వారా పనులు చేయిస్తా.

– శ్రీధర్‌రావు, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత

## డ్రెయినేజీలోకి నీరు వెళ్లేలా చేయాలి



జనావాసాల మధ్య నిలిచిన మురుగు నీరు

**చిల్పూరు:** మండలంలోని నష్కల్ గ్రామంలో 5వ వార్డులో డ్రెయినేజీ ఉన్నప్పటికీ అందులోకి నీరు వెళ్లేలా గ్రామ పంచాయతీ వారు చేయక పోవడంతో జనావాసాల మధ్య మురుగు నీరు నిలుస్తోందని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. 5వ వార్డులోని గౌడ కమ్యూనిటీ హాల్ ఎదురుగా డ్రెయిఇనేజీ లేక పోవడంతో నూతనంగా నిర్మించారు. కాగా, మురుగు నీరు అందులోకి వెళ్లేలా చేయాల్సిన జీపీ వారు పట్టించుకోక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు గ్రామ ప్రత్యేకాధికారి మధుసూదన్, కార్యదర్శి స్నేహలకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలో చెత్తను కూడా సేకరించక పోవడంతో ఇళ్లలో నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించకుంటే జిల్లా కలెక్టర్, డీపీఓలకు వినతి పత్రాలను అందజేస్తామన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలు వద్ద కాలనీ వాసులు

**బచ్చన్నపేట:** మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుకాల ఉన్న కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని కాలనీ వాసులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కాలనీలోకి కరెంట్ వచ్చేందుకు స్తంభాన్ని పాతి విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి పోల్‌కు సపోర్టు స్టే వైరును కూడా అమర్చారు. కానీ ఇటీవల స్తంభం స్టే వైరును సీసీ రోడ్డు వేసే క్రమంలో తొలగించారు. కాగా, కాలనీలో ఒకరు ఇంటి నిర్మాణాన్ని చేపట్టే క్రమంలో అడ్డుగా వస్తున్న విద్యుత్ తీగలను జీపీ ఆవరణలోని వేప చెట్టుకు కట్టేశారు. దీంతో స్తంభం ఒకవైపునకు ఒరిగింది. ఇలాగే ఉంటే స్తంభం విరిగి పడే ప్రమాదం ఉందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభం, తీగలను సరి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాలనీ వాసులు ఎడబోయిన అజయ్, అనసూర్య, నాంపల్లి సోములు, బద్దిపడిగె కౌంసల్య, బండెల నిర్మల నాంపల్లి మహేష్ తదితరులు ఉన్నారు.